సాక్షి కామారెడ్డి

శనివారం । 4 । అక్టోబర్ । 2025



గాంధీ మార్గం అనుసరణీయం

జాతిపిత మహాత్మా గాంధీజీ మార్గం అనుసరణీయమని, ఆయన వల్లే భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చిందని వక్తలు అన్నారు.

- 10లో ▸



అక్కంపల్లిలో తాగునీటి ఎద్దడి

పండుగ వేళ అక్కంపల్లిలో తాగునీటి ఎద్దడి నెలకొంది. రెండురోజులుగా గ్రామంలో తాగునీటి సరఫరా లేదు.

- 11లో ▸

గరిష్టం/కనిష్టం

34.6 /21.0

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని తిమ్మాపూర్ పెద్దచెరువు కట్ట తాత్కాలిక నిర్మాణ పనులను నీటి పారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా చెరువుకట్ట తెగిపోవడంతో తాత్కాలిక మరమ్మతులు చేయిస్తున్నారు. శుక్రవారం పనులను పరిశీలించిన డీఈ.. త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆయనవెంట సిబ్బంది ఉన్నారు.

‘సాగర్’కు తగ్గని వరద

- కొనసాగుతున్న నీటి విడుదల



నిజాంసాగర్(జుక్కల్) : పొరుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తుండడంతో సింగూరు ప్రాజెక్టు ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టులోకి లక్షా 8 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు శుక్రవారం తెలిపారు. 10 గేట్లను ఎత్తి 76,020 క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.8టీఎంసీలు) కాగా, శుక్రవారం సాయంత్రానికి 1402.25 అడుగుల (14.07 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని అధికారులు వివరించారు.

ఎస్సారెస్పీలోకి 800 టీఎంసీల వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ప్రస్తుత సంవత్సరం ఇప్పటి వరకు 800 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి 3 లక్షల క్యూసెక్కుల వరద నీరు ఇంకా కొనసాగుతుంది. దీంతో ప్రాజెక్ట్ నుంచి 33 వరద గేట్ల ద్వారా లక్షా 75 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. వారం రోజుల క్రితం ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో తక్కువగా ఉన్నప్పటికి ప్రాజెక్ట్ నుంచి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి భారీగా నీటిని వదిలిపెట్టారు. దీంతో ప్రాజెక్ట్ నీటి మట్టం భారీగా తగ్గింది. ప్రస్తుతం ప్రాజెక్ట్ నీటి మట్టం పెంచడం కోసం అధికారులు అవుట్ ఫ్లోను తగ్గించారు. అలాగే ఆయకట్టుకు కాలువల ద్వారా నీటి విడుదలను కొనసాగిస్తున్నారు.

నేడు ఆర్‌ఎస్‌ఎస్ విజయ దశమి ఉత్సవం

కామారెడ్డి అర్బన్: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ గాంధీ గంజ్ బస్తీ విజయ దశమి ఉత్సవాన్ని శనివారం ఉదయం 9గంటలకు నిర్వహించనున్నట్లు బస్తీ ప్రముఖ్ పబ్బ శ్రీనివాస్, నగర కార్యవాహ కే శివరాజు శుక్రవారం తెలిపారు. అయ్యప్ప ఫంక్షన్ హాలులో నిర్వహించనున్న ఉత్సవానికి వక్తగా ఇందూర్ విభాగ్ ప్రచారక్, తెలంగాణ ప్రాంత సహబౌద్ధిక్ ప్రముఖ్ నర్రా వెంకట శివకుమార్ హాజరుకానున్నట్లు తెలిపారు.

రైల్వేస్టేషన్‌కు హెగ్డేవార్ పేరు పెట్టాలి

సుభాష్‌నగర్ : నిజామాబాద్ రైల్వేస్టేషన్ లేదా బస్టాండ్‌కు ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ హెగ్డేవార్ కేశవరావు బలిరామ్ పేరు పెట్టాలని ఆయన ముని మనవడు హెగ్డేవార్ దిలీప్ శాస్త్రి ఒక ప్రకటనలో కోరారు. దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన హెగ్డేవార్ పరివారానికి ప్రత్యేకత ఉందన్నారు. హెగ్డేవార్ పేరుతో ఇప్పటికే కందకుర్తిలో స్మృతి మందిరం నిర్మాణం కోసం తన తండ్రి హెగ్డేవార్ శ్రీరామశాస్త్రి ఆర్‌ఎస్‌ఎస్‌కు స్థలం ఇచ్చారన్నారు. అందులో భాగంగా ప్రధాన రైల్వేస్టేషన్ లేదా బస్టాండ్‌కు హెగ్డేవార్ పేరు పెట్టాలని దిలీప్ శాస్త్రి కోరారు.

శోభాయాత్ర



భిక్కనూరు మండలం కాచాపూర్‌లో దుర్గాదేవి శోభాయాత్ర

వైభవంగా కొనసాగిన శరన్నవరాత్రులు మహార్నవమితో ముగిశాయి. అమ్మవారి ప్రతిమలను మండపాల్లో ప్రతిష్ఠించి నియమనిష్ఠలతో పూజలు చేసిన భక్తులు భక్తిశ్రద్ధలతో తల్లిని సాగనంపారు.

రావణ దహనం



మద్నూర్‌లో రావణ దహనం..

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా పర్వదినాన జిల్లాలోని పలు చోట్ల రావణ దహనాన్ని నిర్వహించారు. బాణాసంచా కాల్చి వేడుకలు నిర్వహించారు.

శమీ పూజ



గాంధారిలో శమీ పూజ..

జిల్లాలో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయుధ, శమీపూజ నిర్వహించిన అనంతరం ఒకరికొకరు బంగారం (జమ్మి) ఇచ్చిపుచ్చుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నీట మునిగిన ఆశలు!



చెరువు కాదు.. పంట చేలను ముంచేసిన మంజీర

గలగల పారుతూ కనువిందు చేయాల్సిన మంజీర నది.. రైతు కంటి మీద కునుకు లేకుండా చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా వ్యవసాయ భూముల్లోకి దూసుకొచ్చిన మంజీర.. పంట పొలాలను తనలో కలిపేసుకుంది. నీట మునిగిన పంటలు నెల రోజులవుతున్నా బయటికి కనిపించకపోవడంతో ఇక తాము మునిగినట్టేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- నెల రోజులుగా తగ్గని మంజీర ప్రవాహం
- వేలాది ఎకరాల పంటలు నీటిలోనే
- పెట్టుబడులు నష్టపోయిన రైతులు
- అందని సర్కారు సాయం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : మంజీర పరవళ్లు వేలాది మంది రైతుల ఆశలను ముంచేశాయి. నెల రోజులుగా తగ్గేదే లేదన్నట్టుగా మంజీర పోటెత్తి ప్రవహిస్తోంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో సింగూరు, ఘనపుం ఆనకట్టల ద్వారా భారీగా వస్తున్న వరదతో మంజీర ప్రవాహం నిరాటంకంగా కొనసాగుతోంది. దీంతో మంజీర పరీవాహక ప్రాంతాల్లోని వేలాది ఎకరాల పంటలు నీట మునిగాయి. అప్పట్లో భారీ ప్రవాహం వస్తే నాలుగు రోజుల్లో తగ్గిపోయి, పంట తేరుకునేది. అయితే గడిచిన నెల రోజులుగా మంజీర ప్రవాహం తగ్గకపోగా మరింత పెరుగుతూనే ఉంటోంది. దీంతో పొలాల నిండా నీళ్లు నిండి చెరవులను తలపిస్తున్నాయి. పంటల ఆనవాళ్లే కనిపించడం లేదు. దీంతో నీరు తగ్గినా పంట కోలుకునే పరిస్థితి లేదు. దశాబ్దాలుగా మంజీర తీరంలో ముంపు సమస్య రైతాంగాన్ని వేధిస్తోంది. జిల్లాలోని నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, నిజాంసాగర్, మహ్మద్‌నగర్, పిట్లం, బిచ్కుంద తదితర మండలాలను ముంపు సమస్య వెంటాడుతోంది. ప్రధానంగా నాగిరెడ్డిపేట మండలంలో ముంపు సమస్య తీవ్రంగా ఉంటోంది. నాగిరెడ్డిపేట మండలంలోని గోలిలింగాల, మాల్తుమ్మెద, చీనూర్, వాడి, నాగిరెడ్డిపేట, లింగంపల్లి, వెంకంపల్లి, తాండూర్, మాటూర్, మాసన్‌పల్లి, ఆత్మకూర్, జలాల్‌పూర్ గ్రామాలతోపాటు ఎల్లారెడ్డి మండలంలోని పలు గ్రామాలకు చెందిన పంటలు నీట మునిగాయి. రోజురోజుకూ పెరుగుతున్న నీటి ప్రవాహంతో నీరు మరింతగా విస్తరించి మరిన్ని పొలాలు నీట మునుగుతున్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి రోజూ లక్ష క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నప్పటికీ ఎగువ నుంచి ప్రవాహం ఎక్కువగా ఉండడం, నిజాంసాగర్ ప్రాజెక్టు వెనుకభాగంలో నీరు తన్నడంతో ఆయా గ్రామాల పరిధిలోకి నీరు చొచ్చుకువచ్చి పొలాలను ముంచెత్తింది.

ఐదు వేల ఎకరాలకు పైనే..

నాగిరెడ్డిపేట మండలంలోని 12 గ్రామాల పరిధిలో దాదాపు మూడు వేల ఎకరాల్లో పంటలు మంజీర నీటిలో మునిగాయి. నెల రోజులుగా పొలాల నిండా నీళ్లున్నాయి. కొన్ని చోట్ల పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. అలాగే ఎల్లారెడ్డి, పిట్లం, మహ్మద్ నగర్, నిజాంసాగర్, బిచ్కుంద మండలాల పరిధిలో దాదాపు రెండు వేల ఎకరాల్లో పంటలు నీట మునుగుతున్నట్టు అంచనా. మొత్తంగా ఐదు వేల ఎకరాలకు పైగా పొలాలు మంజీర ప్రవాహంలో మునుగుతున్నాయని స్పష్టమవుతోంది. నాలుగు రోజులు నీరు నిలిచి వెళ్తే పెద్దగా ఇబ్బంది ఉండదని, కానీ నెల రోజులు గడచినా నీరు పొలాల్లోనే నిలిచి ఉండడంతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా చోట్ల వరి పంట దెబ్బతిన్నది. దీంతో రైతులు పెట్టుబడులు కూడా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. పంట పొట్ట దశలోకి వచ్చిన సమయంలో మంజీర ప్రవాహం కారణంగా నాశనమై పెట్టుబడులు కూడా కోల్పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిశీలించనున్న హరీశ్‌రావు

- రేపు నాగిరెడ్డిపేట మండలంలో పర్యటన

భారీ వర్షాలు, మంజీర ప్రవాహంతో నీట మునిగిన పంటలను బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావ్ ఈ నెల 5వ తేదీన పరిశీలించనున్నారు. ఈ మేరకు ఆయన నాగిరెడ్డిపేట మండలంలో పర్యటిస్తారని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ‘సాక్షి’కి తెలిపారు. జిల్లాకు సీఎం వచ్చి వెళ్లినా రైతులకు ఎలాంటి పరిహారం ఇవ్వలేదని, రైతులు తీవ్రంగా నష్టపోయినా ప్రభుత్వం ఆదుకోవడం లేదన్నారు.

సర్వేతోనే సరిపెట్టారు

నీట మునిగిన పంటల వివరాలను సేకరించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు పలుమార్లు సర్వే నిర్వహించారు. ఆగస్టు నెలాఖరులో జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో పంటలు నీట మునగడం, కొట్టుకుపోవడం, ఇసుక మేటలు వేయడం వల్ల దాదాపు 90 వేల ఎకరాలకు నష్టం వాటిల్లినట్లు అప్పట్లో ప్రాథమికంగా అంచనా వేశారు. తరువాత పంట నష్టం 50 వేల ఎకరాలు అని, ఆ తరువాత 30 వేల ఎకరాలకు తీసుకువచ్చారు. క్షేత్ర స్థాయి పరిశీలన జరిపిన తరువాత 26,214 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు తేల్చారు. అయితే మంజీర పరీవాహక ప్రాంతంలో నీట మునుగుతున్న పంటల విస్తీర్ణం రోజురోజుకూ పెరుగుతోంది. నెల రోజులుగా ప్రవాహ ఉధృతి పెరుగుతుండడంతో పంటలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు నయా పైసా సాయం అందలేదు.

పదహారెకరాలు మునిగిపోయింది



పదహారు ఎకరాల్లో వరి పంట వేసిన. మొత్తం నీట మునిగిపోయింది. కోళ్ల ఫామ్ కూడా మునిగిపోయింది. మంజీర ప్రవాహం తగ్గకపోవడంతో నీరు పొలాలను వదలడం లేదు. నెల రోజులుగా నీటిలోనే పంట ఉండడంతో మొత్తం నాశనం అయ్యింది. కోలుకునే పరిస్థితి లేదు. రూ.6 లక్షలకు పైగా నష్టపోయాను.

– నర్సింహారెడ్డి, రైతు, నాగిరెడ్డిపేట

పంట చేతికి రాదు



నా సొంత భూమి ఏడెకరాలకు తోడు ఐదెకరాలు కౌలుకు తీసుకుని పంట వేసిన. మంజీరతో చేనంతా నిండిపోయింది. పొలమే కనబడడం లేదు. నెల రోజులనంది నీళ్లు పొలంలో నిలిచిపోయి మొత్తం దెబ్బతింటోంది. ఎన్నడూ ఇన్ని రోజులు నీళ్లు ఆగలేదు. పంట చేతికొచ్చే పరిస్థితి లేదు. లాగోడీ మునుగుడే.

– రాములు, రైతు, చీనూర్, నాగిరెడ్డిపేట మండలం

రివ్యూ లేదు.. నిధులూ రాలేదు

- సీఎం వచ్చివెళ్లి నెలరోజులైంది..

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : భారీ వర్షాలతో అతలాకుతలమైన కామారెడ్డి జిల్లాను ఆదుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చి నేటికి నెల రోజులైంది. గత నెల 4వ తేదీన కామారెడ్డి జిల్లాలోని లింగంపేట మండలం లింగంపల్లి కలాన్, బూరుగిద్దతోపాటు కామారెడ్డి పట్టణంలోని జీఆర్ కాలనీలను సందర్శించారు. దెబ్బతిన్న పంటలు, రోడ్లు, వంతెనలతోపాటు నీట మునిగిన జీఆర్ కాలనీని పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్ష నిర్వహించి, పక్షం రోజుల్లో ప్రత్యేకంగా రివ్యూ చేస్తానని చెప్పారు. నష్టపోయిన రైతులను ఆదుకుంటామని, దెబ్బతిన్న రోడ్లు, వంతెనలను త్వరితగతిన మరమ్మతులు చేయించడంతోపాటు పూర్తి స్థాయిలో నిర్మాణాలు చేపడతామని భరోసా ఇచ్చారు. అయితే నెల రోజులు గడచినా సీఎం రివ్యూ చేయకపోవడం, నిధులు విడుదల కాకపోవడంతో జిల్లా ప్రజలు నిరాశకు గురవుతున్నారు. వాగులు పొంగి పొర్లడంతో వంతెనలు, రోడ్లు కొట్టుకుపోయాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంలో మూడు కాలనీలు నీట మునిగాయి. వందలాది కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయి. జిల్లాలో రోడ్లు, వంతెనలు, చెరువులు, ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టేందుకు దాదాపు రూ. 350 కోట్లు ఖర్చవుతాయని అధికారులు అంచనాలు వేశారు. అలాగే దెబ్బతిన్న పంటలకు సంబంధించి రూ.50 కోట్లపైనే నష్టం జరిగింది. ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ఇస్తేగానీ గాడిన పడే పరిస్థితి లేదు. ఇప్పటికైనా సీఎం ఉన్నత స్థాయిలో సమీక్ష నిర్వహించి జిల్లాకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని పలువురు కోరుతున్నారు.



లింగంపేట్ మండలం బూరుగిద్ద గ్రామంలో బాధితులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)

స్థానిక ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్ : అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాయంలో శుక్రవారం నిర్వహించిన స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పోటీ చేసే అవకాశం లేని వారు అభ్యర్థులను గెలిపించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఓటూ కీలకమన్నారు. ఏళ్ల తరబడి పార్టీకి సేవ చేస్తున్న కార్యకర్తలు ప్రజాప్రతినిధులు అయ్యే అవకాశం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉంటుందన్నారు. బీజేపీ కార్యకర్తలు ఇప్పటి నుండే ప్రజల్లో ఉంటూ కేంద్ర ప్రభుత్వ పథకాలను, బీజేపీ సిద్ధాంతాలను, నరేంద్ర మోదీ సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యులుగా మెజారిటీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని అన్నారు.

సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు, మాజీ ఎమ్మెల్యే అరుణతారా, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అధర్మంపై ధర్మానిదే విజయం

- దసరా వేడుకల్లో ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- జాతీయ జెండా ఆవిష్కరణ



దసరా ఉత్సవాల్లో ప్రసంగిస్తున్న పోచారం



జాతీయ జెండాకు వందనం చేస్తున్న ప్రభుత్వ సలహాదారు పోచారం, పక్కన కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ : అధర్మంపై ఎప్పుడూ ధర్మమే విజయం సాధిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి పాత బాన్సువాడ చావిడి వద్ద జాతీయ జెండాను పోచారం ఆవిష్కరించారు. ఆర్య సమాజ్ మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ర్యాలీగా మినీస్టేడియానికి చేరుకున్నారు. రావణ దహనం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెడుపై మంచి విజయం సాధిస్తుందన్నారు. దేవినవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ సంబరాలను ప్రజలు ఆనందంగా జరుపుకున్నారని అన్నారు. ప్రజలందరికి దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కత్తెర గంగాధర్, మున్సిపల్ మాజీ చైర్మన్ జంగం గంగాధర్, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, కాసుల రోహిత్, నార్ల రవీందర్, కృష్ణారెడ్డి, ఎజాస్, శ్రీధర్, ఖలేక్, నాగులగామ వెంకన్న, నార్ల ఉదయ్, దాసరి శ్రీనివాస్, శివదయాళ్ వర్మ, గడుమల లింగం తదితరులు పాల్గొన్నారు.


గాంధీ చూపిన మార్గంలో నడవాలి



జిల్లా కేంద్రంలో మహాత్మునికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సంగ్వాన్, అధికారులు

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ఘనంగా గాంధీ జయంతి

కామారెడ్డి క్రైం : మహాత్మా గాంధీ చూపిన అహింసా మార్గంలో నడవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని గంజ్ మార్కెట్ యార్డులో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదనపు కలెక్టర్ విక్టర్, తహసీల్దార్ జనార్దన్, అధికారులు పాల్గొన్నారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాజేశ్ చంద్ర, అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, ఏఎస్పీ చైతన్యరెడ్డి

జిల్లా పోలీసు కార్యాలయంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎస్పీ రాజేశ్ చంద్ర గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, ఏఎస్పీ చైతన్యరెడ్డి, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా చక్కెర తీర్థం



మాచారెడ్డి : చుక్కాపూర్‌లో విజయదశమి సందర్భంగా లక్ష్మీ నర్సింహస్వామి చక్కెర తీర్థోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అటవీ ప్రాంతంలో ఉన్న స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగింపుగా గ్రామానికి తరలించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి రథం ముందు చక్క భజనలతో పాటు చక్కెరను పంచిపెట్టారు. చక్కెర తీర్థం సందర్భంగా భక్తులు వారి కోరికలు తీరిన అనంతరం చక్కెర పంచిపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, ఈవో ప్రభు, డైరెక్టర్లు లక్ష్మీరాజం, రాజిరెడ్డి, గ్రామ పెద్దలు ఉన్నారు.

బురుజుపై జాతీయ జెండా రెపరెపలు



దోమకొండ: దసరా పండుగ సందర్భంగా గురువారం దోమకొండ బురుజుపై జాతీయ జెండాను ఎగురవేశారు. విజయదశమి ఆనవాయితీ ప్రకారంగా ముందుగా గ్రామ శివారులో జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి చావిడి వద్దకు తీసుకువచ్చారు. అక్కడ గ్రామ ప్రత్యేకాధికారి ప్రవీణ్‌కుమార్‌తో బురుజుపై జాతీయ జెండాను ఎగురవేశారు. చాముండేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ సిద్దారెడ్డి, సీడీసీ మాజీ చైర్మన్ ఐరేని నర్సయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుంచాల శేఖర్, మాజీ సర్పంచ్ నల్లపు అంజలి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఓంకార జెండా ఆవిష్కరణ



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఆర్య సమాజ్ భవనంలో దసరా సందర్భంగా గురువారం ఓంకార జెండాను ఆర్య సమాజ అధ్యక్షుడు పడిగల విజయకుమార్ ఉపాధ్యక్షులు నాజోజు శ్రీనివాస్ చారి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు ఓంకా జెండాను పట్టుకుని గ్రామ పురవీధుల గుండా ఓంకార నానార్ నినాదాలు చేస్తూ ఊరేగించారు. విజయదశమి రోజు చెడుపై మంచి సాధించిన విజయానికి సూచికగా ఓంకార జెండాను ప్రతి సంవత్సరం విజయదశమి రోజు ఆవిష్కరిస్తామని తెలిపారు.

క్రైం కార్నర్

బెల్టు షాపులపై దాడి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా గ్రామాల్లోని బెల్టు షాపులపై దాడి చేసినట్లు ఎస్సై దీపక్‌కుమార్ శుక్రవారం తెలిపారు. మండలంలోని ఎక్కపల్లితండా, పర్మళ్ల, నల్లమడుగు, సజ్జన్‌పల్లి తదితర గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం రావడంతో దాడులు చేసినట్లు తెలిపారు. నిర్వాహకుల వద్ద ఉన్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిర్వాహకులపై కేసులు నమోదు చేశామన్నారు.

ధర్పల్లిలో బైక్ దహనం



ధర్పల్లి: ఇంటి ఎదుట నిలిపిన బైకును గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేసిన ఘటన ధర్పల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి గురువారం రాత్రి తన బైకును ఇంటి ఆవరణలో పార్క్ చేసి ఉంచాడు. గుర్తుతెలియని వ్యక్తులు తగలబెట్టడంతో బైకు పూర్తిగా కాలి బూడిదయ్యింది. మరుసటి రోజు ఉదయం బాధితుడు బైక్ కాలిపోయి ఉండటాన్ని చూసి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కళ్యాణి తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి గల్లంతు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోచారం ప్రాజెక్టు దిగువన ఉన్న పెద్దవాగులో చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి నీటిలో మునిగి గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. రాజంపేట మండలం సిద్దాపూర్‌కు చెందిన మచ్చంటి శేఖర్(32)అనే వ్యక్తి తన ఏడేళ్ల కుమారుడు అనిల్‌తో కలిసి గురువారం చేపలు పట్టేందుకు పోచారం ప్రాజెక్టు దిగువన ఉన్న పెద్దవాగు వద్దకు వచ్చాడు. చేపలు పట్టేక్రమంలో కొడుకు అనిల్ కళ్లేదుటే నీటిలోకి దిగిన శేఖర్ ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. కాగా శేఖర్ మృతదేహం కోసం నాగిరెడ్డిపేట ఎస్సై భార్గవ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి ఫైర్‌స్టేషన్ సిబ్బంది సహకారంతో గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం రాత్రి వరకు కూడ అతని మృతదేహం లభ్యమవలేదు.

యథేచ్ఛగా అక్రమ నియామకాలు!

- మైనారిటీ సంక్షేమ శాఖలో అధికారులు, ఏజెన్సీ నిర్వాహకుడి దందా
- డబ్బులు ఇచ్చిన అభ్యర్థులకే ఉద్యోగాలు
- అర్హులకు అన్యాయం చేస్తున్న వైనం



నిజామాబాద్‌అర్బన్: జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖలో అక్రమ నియామకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఏజెన్సీతో కుమ్మక్కైన ఇద్దరు అధికారులు నియమ, నిబంధనాలను తుంగలో తొక్కి ఈ అక్రమ నియామకాలు కొనసాగిస్తున్నారు. నిరుద్యోగుల నుంచి రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేస్తూ, అర్హులకు అన్యాయం చేస్తూ ఉద్యోగాలను అమ్ముకుంటున్నారు. ఈ వ్యవహారం గత కొనేళ్లుగా సాగుతోందని సమాచారం. ఇటీవల పలు ఉద్యోగాలకు దరఖాస్తు చేసిన వారు అర్హత ఉండి ఉద్యోగం రాలేదని అనుమానంతో ఆరా తీయగా ఈ అక్రమాల నియామకాలు వెలుగులోకి వచ్చాయి.

ఇదీ పరిస్థితి..

మైనారిటీ సంక్షేమ శాఖలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో కళాశాలలో, పాఠశాలలో బోధన, బోధ నేతర సిబ్బందిని అవసరం మేర నియమించేందుకు అవకాశం ఉంది. సంబంధిత శాఖకు అగ్రిమెంట్ అయి ఉన్న అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా నియామకాలు జరుపుతారు. అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించి, తుది నివేదికను సిద్ధం చేసి అర్హులకు ఉద్యోగం కల్పించాల్సి ఉంది. కానీ ఇది కూడా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు.

- కొన్ని రోజుల క్రితం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖలో ఓ ఉద్యోగి ఔట్‌సోర్సింగ్‌లో నియమించబడ్డాడు. ఎలాంటి పేపర్ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. దరఖాస్తులు స్వీకరించలేదు. ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో నమోదు కూడ చేసుకోలేదు. ఓ అధికారి ఖాళీ పోస్టు భర్తీ కోసం మరో అధికారికి లేఖ పంపి ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా నియామకం చేపట్టారు. సదరు అభ్యర్థి నుంచి రూ.1,50,000 వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఇద్దరు అధికారులు ఒక ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకుడు వాటాలుగా పంచుకున్నారని తెలిసింది.
- మే నెలలో ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని ఎలాంటి నోటీస్ లేకుండానే తొలగించారు. కానీ సదరు ఉద్యోగికి సంబంధించిన వేతనాన్ని రూ.45000 ఓ అధికారి వాడుకున్నారు. ఈ విషయమై బాధితుడు ప్రశ్నిస్తే ఇదే స్థానంలో మరొక పనికి డబ్బులు వాడినట్లు తెలిసింది. వాస్తవానికి ఒక ఉద్యోగి వేతనాన్ని అనుమతి లేకుండా వాడుకునే నిబంధన లేనేలేదు.
- కొన్ని రోజుల క్రితం అవుట్‌సోర్సింగ్ పద్ధతిన జూనియర్ లెక్చరర్ నియామకాలు చేపట్టారు. ఇందులో ఓ అభ్యర్థికి మూడు సంవత్సరాల అనుభవం, పీజీ పూర్తి చేసి ఉండగా, ఈమెను కాదని కేవలం బీఈడీ చేసి రెండు సంవత్సరాల అనుభవం ఉన్న మరో అభ్యర్థికి ఉద్యోగం కల్పించారు. ఇందులో ఓ అధికారి సుమారు లక్షల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- గత నియామకాలకు సంబంధించి కామారెడ్డి జిల్లాకు చెందిన ఇద్దరు అభ్యర్థులు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోకున్నా.. వారిని జిల్లాలోని నాగారం ప్రాంతంలో జూనియర్ లెక్చరర్‌గా నియమించారు. దీనిపై జిల్లాకు చెందిన ఓ యువతి సమాచార హక్కు చట్టం కింద వివరణ కోరగా నేటికీ సమాచారం ఇవ్వడం లేదు.
- అంతేకాక గత జులైలో నిర్వహించిన జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీలో దరఖాస్తు సమయానికి నిరుద్యోగులు దరఖాస్తులు ఇవ్వలేదు. కానీ ఇద్దరిలో ఒకరిని బోధన్‌లో మరొకరిని నాగారంలో నియమించారు. ఇందులో కార్యాలయంలో పనిచేసే ఉద్యోగి కీలకపాత్ర పోషించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే ఏజెన్సీల నిర్వహణపై అధికారం ఉన్న మరో ఉద్యోగి సహకరించినట్లు తెలుస్తోంది.
- మైనార్టీ సంక్షేమ శాఖలో ఎక్కడైన పోస్టు ఖాళీగా ఉంటే, భర్తీ కోసం ఉద్యోగి కావాలని శాఖ అధికారులు ఉపాధి కల్పన శాఖ అధికారికి నివేదిస్తున్నారు. దానిని సంబంధిత ఏజెన్సీకి సమాచారం అందిస్తున్నారు. ఉపాధి కల్పన అధికారి ఏజెన్సీ నుంచి ఉద్యోగిని కోరుతున్నట్లు మరో నివేదిక ఇస్తున్నారు. ఇలా ముగ్గురు కలిసి తమకు సంబంధించిన వ్యక్తిని నియమించుకుంటారు. ఉద్యోగం పొందిన వ్యక్తి నుంచి ఏజెన్సీ నిర్వాహకులు డబ్బులు వసూలు చేసి ఇద్దరు అధికారులకు వాటాలు పంచుతున్నారు. ఇలా ఇప్పటివరకు 20 నుంచి 30 వరకు ఉద్యోగాలను నిబంధనలకు విరుద్ధంగా కల్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నియామకాలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

విచారణ జరపాలి..

మైనారిటీ శాఖలో అక్రమ నియామకాలపై విచారణ జరపాలి. సదు నియామకాలపై సమాచారం అడిగితే సంబంధిత శాఖ వారు స్పందించడం లేదు. నిరుద్యోగుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసి ఉద్యోగాలు కల్పిస్తున్నారు. అర్హులకు అన్యాయం చేస్తున్నారు. ఉన్నత స్థాయి విచారణ జరిపితే అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

– రాజేశ్వర్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

సక్రమంగానే జరిగాయి..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే నియామకాలు జరుగుతున్నాయి. మేము కేవలం దరఖాస్తుల పరిశీలన చేసి పంపుతాము. ఇప్పటి వరకు జరిగిన నియామకాలు సక్రమంగానే జరిగాయి. కొందరు ఉద్యోగ నియామకాల్లో అక్రమలు జరిగినట్లు ఫిర్యాదులు చేశారు. వాటిపై విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకుంటాం.

– కృష్ణవేణి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు



నాయకులను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేత కేతి మధు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాసాన్‌పల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్, లింగంపల్లికలాన్ మాజీ సర్పంచ్ తనయుడు నీరుడి రాజు శుక్రవారం బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. వీరితోపాటు గోపాల్‌పేటకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బాబూరావు సైతం కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ వారికి కాంగ్రెస్ కండువాలను కప్పి ఆహ్వానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలని, పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, నాయకులు విక్రాంత్‌రెడ్డి, బాల్‌రెడ్డి, బండ బాబు, బన్సి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేత

భిక్కనూరు: రామేశ్వర్‌పల్లికి చెందిన కాంగ్రెస్ నేత కేతి మధు శుక్రవారం బీఆర్‌ఎస్‌లో తన అనుచరులతో కలిసి చేరారు. బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి శ్రీనివాస్ పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా కేతి మధు మాట్లాడుతూ.. రుణమాఫీ చేయడం, యూరియా సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అందుకే పార్టీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నానన్నారు. విండో చైర్మన్ నాగార్తి భూంరెడ్డి, నేతలు అందె మహేందర్‌రెడ్డి, ద్యావర సాయిరెడ్డి, అనంత్ గౌడ్, తక్కళ్ల రవీందర్ రెడ్డి, పోతిరెడ్డి, జిల్లెల రవీందర్ రెడ్డి, నర్సారెడ్డి పాల్గొన్నారు.

కామారెడ్డిలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

- గాజు ముక్కతో దాడిలో నలుగురికి తీవ్ర గాయాలు!
- కత్తిపోట్లంటూ పట్టణంలో ప్రచారం



దాడిలో గాయపడిన వ్యక్తి

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలో పండుగపూట జరిగిన ఇరు వర్గాల మధ్య ఘర్షణ కలకలం సృష్టించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. పట్టణంలోని సుభాష్ రోడ్‌లో ఉన్న శాస్త్రి దుర్గామాత మండపం వద్ద నిత్యం వందల సంఖ్యలో జనం దాండియా కార్యక్రమంలో పాల్గొంటారు. దసరా రోజున గురువారం సైతం భారీ సంఖ్యలో ప్రజలు దాండియాలో పాల్గొన్నారు. ఈక్రమంలో అర్ధరాత్రి సమయంలో కేతన్ అనే యువకుడు, అతని స్నేహితుడైన బృందన్‌తో కలిసి ఓ చోట మూత్రవిసర్జనకు చేస్తుండగా ప్రణయ్, వరుణ్, షణ్ముఖంలు వచ్చి దూరంగా వెళ్లాలని వారించారు. కేతన్ సమాచారం ఇవ్వడంతో అతని అన్న ప్రఫుల్ అక్కడకు వచ్చాడు. వాగ్వాదం జరిగి ఇరు వర్గాల మధ్య గొడవకు దారి తీయగా, ఇరువర్గాలకు చెంది న చాలా మంది అక్కడ పోగ య్యారు. వారిలో నుంచి సి ద్ధార్థ్ అనే యువకుడు గాజు ముక్కను తీసుకుని ప్రఫుల్, రాహుల్, మణికంఠ, మణిరాజులపై దాడి చేశాడు. వెంట నే సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకు ని ఇరువర్గాలను చెదరగొట్టారు. గాయపడిన వారిని వెంటనే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కేతన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి తెలిపారు. కానీ పట్టణంలో మాత్రం కత్తిపోట్ల ఘటన జరిగిందని జోరుగా ప్రచారం జ రిగింది. నలుగురు వ్యక్తులు కత్తిపోట్లకు గురయ్యార ని స్థానికులు సైతం చెబుతున్నారు. పోలీసులు గాజుతో జరిగిన దాడి అని కేసు నమోదు చేయడంతో అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

గాజుల సంబురాలు



భిక్కనూరు: తిప్పాపూర్ గ్రామంలో దాయారీ నాగార్తి సంఘం ఆధ్వర్యంలో గాజుల సంబురాల కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు.. గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి ఒడి బియ్యం సమర్పించుకున్నారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రసాదం పంపిణీ చేశారు.

మహిళ దారుణ హత్య!



శీలంవార్ లింగవ్వ (ఫైల్)

బోధన్: మహారాష్ట్రకు చెందిన ఓ మహిళ ఎడపల్లి మండలంలో దారుణ హత్యకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ తెలిపిన వివరాలు ఇలా.. మహారాష్ట్ర ప్రాంతంలోని నాందేడ్ జిల్లా, బిలోలి తాలూకా, కొండల్‌వాడి గ్రామానికి చెందిన శీలంవార్ లింగవ్వ (55) బతుకమ్మ పండుగ కోసం కొన్నిరోజుల క్రితం ఎడపల్లి మండలంలోని జంలం గ్రామంలోని తన కూతురు ఇంటికి వచ్చింది. అనంతరం సెప్టెంబర్ 28న ఎడపల్లి మండలం పోచారం గ్రామంలోని తన చెల్లెలు కుమారుడైన బెజ్జంకి వెంకట్ వద్దకు బస్సులో బయలుదేరింది. ఆమె దూపల్లి గేట్ వద్దకు చేరుకోగా, అక్కడ గుర్తుతెలియని వ్యక్తి బైక్ మీద లిఫ్ట్ ఇచ్చాడు. ఆ వ్యక్తి అదను చూసి లింగవ్వ తలపై బలమైన ఆయుధంతో మోదీ హత్య చేశాడు. ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకొని, మృతదేహాన్ని జైతాపూర్ గ్రామ శివారులోని చెరుకుతోటలో పడేసి పారిపోయాడు. గురువారం అర్ధరాత్రి జైతాపూర్ గ్రామానికి చెందిన పురిమేటి బాలకృష్ణ అనే వ్యక్తి తన ఆటోలో మృతదేహాన్ని తరలిస్తుండగా గ్రామస్తులు పట్టుకున్నారు. మృతదేహం గోనె సంచిలో చుట్టి ఉండటంతో పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉంది. ఈ విషయాన్ని గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు



శెట్పల్లిలో శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న యువకులు



ఎంద్రియాల్‌లో..



మాట్లాడుతున్న వక్త వేదమిత్ర

లింగంపేట(ఎల్లారెడ్డి): శెట్పల్లి గ్రామంలో గురువారం ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాడ్వాయి ఖండ శారీరక్ ప్రముఖ్ రాజారాం రంజిత్ మాట్లాడారు. గ్రామాల్లో ప్రతీ యువకుడు ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరాలని పిలుపునిచ్చారు. హిందుత్వ జీవన విధానం, విశ్వశాంతికి ఆధారమని, ప్రపంచంలోని వివిధ మతాలను సమన్వయపరిచే సనాతన జీవన విలువలు హిందుత్వంలో ఉన్నాయని వివరించారు. దేశ అభివృద్ధి, హిందువుల పంచ పరివర్తన కోసం పాటుపడాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఇంటింటికి జన జాగరణ చేపడతామని చెప్పారు.

ఎంద్రియాల్‌లో ..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎంద్రియాల్‌లో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు దేశభక్తి కలిగి ఉండాలన్నారు. ప్రతి గ్రామంలో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

హిందు సంఘటన కోసమే ఆర్‌ఎస్‌ఎస్

నిజాంసాగర్(జుక్కల్): వ్యక్తి నిర్మాణం హిందూ సంఘటన కోసమే ఆర్‌ఎస్‌ఎస్ 100 సంవత్సరాలుగా ప్రయత్నిస్తుందని జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ వక్త వేద మిత్ర అన్నారు. శుక్రవారం మహమ్మద్ నగర్ మండలంలోని బూర్గుల్, నర్వ గ్రామాల్లో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్త మాట్లాడుతూ.. పౌర విధులు, పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ భావన, సామాజిక సమరసత, కుటుంబ ప్రబోధన్ ఇలా సమాజంలో ఐదు పరివర్తనలు రావాలన్నారు. పిట్లం ఖండ సహ శారీరక ప్రముఖ్ పెంటబోయిన మోహన్, శాఖ కార్యవాహలు హోడిగె రవికిరణ్, సంతోష్, సీహెచ్. ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

అలయ్ బలయ్‌లో చుక్కాపూర్ కళాకారుల ధూంధాం



మందకృష్ణ మాదిగతో బేడ బుడగ జంగాల కళాకారులు

మాచారెడ్డి: హైదరాబాద్‌లో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో చుక్కాపూర్ గ్రామానికి చెందిన బేడ బుడగ జంగాల కళాకారులు ఆటపాటలతో ధూంధాం చేశారు. ఈ సందర్భంగా బేడ బుడగ జంగాల ప్రతినిధి లక్ష్మీపతి మాట్లాడుతూ.. తమ వంశీకులు చాపలు అల్లుతూ, బుర్రకథలు చెబుతూ జీవనం సాగిస్తున్నారని, ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్టిఫికెట్లు కూఆ ఇవ్వడం లేదన్నారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ, బండారు దత్తాత్రేయ, కల్వంకుంట్ల కవిత, తదితరులను కలిసి తమ గోడును వినిపించినట్లు ఆయన తెలిపారు. నేతలు శంకర్, రవి, తదితరులున్నారు.

ఆకుల లలితకు 'జెడ్పీ' అవకాశం ఇవ్వాలి



గాంధీభవన్‌లో పీసీసీ మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసిన నాయకులు

మాక్లూర్: మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవిప్రకాష్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు, ఆకుల లలిత హైదరాబాద్‌కు తరలివెళ్లి పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని కలిశారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఆకుల లలితకు అవకాశం కల్పించాలని కోరారు. మండలంలోని మానిక్‌భండార్‌కు చెందిన ఆకుల లలితను మాక్లూర్ జెడ్పీటీసీగా గెలిపించుకుంటామన్నారు. దీనిపై పీసీసీ అధ్యక్షుడు సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. ఇదే విషయమై బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని కూడా కలిసి, చర్చించినట్లు ఆ పార్టీ సీనియర్ నాయకులు 'సాక్షి'తో చెప్పారు. నాయకులు ఎనుగంటి గంగాధర్‌గౌడ్, వెంకటేశ్వరరావు, జంగిడి సతీష్, అమరేందర్‌రావు, రాజేందర్, రాజేశ్వర్, లచ్చారెడ్డి, దయాకర్‌రావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి



మోపాల్‌లో క్రికెట్ ఆడుతున్న సీపీ సాయిచైతన్య



విజేత జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న సీపీ

మోపాల్(నిజామాబాద్‌రూరల్): యువత సన్మార్గంలో నడవాలని, అప్పుడే దేశ భవిష్యత్ బాగుంటుందని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. మోపాల్ పోలీసుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. 13 గ్రామాల నుంచి 13 టీములు పాల్గొనగా, నాలుగు రోజుల పాటు టోర్నమెంట్ కొనసాగింది. ముగింపు కార్యక్రమానికి సీపీ ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. సమాజంలో యువత పెద్ద ఎత్తున మత్తుపదార్థాల వైపు ఆకర్షితమవుతోందని, ఇది ప్రమాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడలు యువతను వ్యసనాల నుంచి దూరంగా ఉంచి, క్రమశిక్షణను, మానవతను నేర్పుతాయన్నారు. క్రికెట్ టోర్నమెంట్‌లో ఉత్సాహంగా పాల్గొని, ఆటలో స్ఫూర్తిని చూపినందుకు అభినందనలు తెలియజేశారు. యువత కోసం దసరా సెలవుల్లో క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటుచేసిన ఎస్‌ఐ జడ్ సుస్మితను అభినందించారు. అనంతరం విజేతలకు సీపీ బహుమతులు ప్రదానం చేశారు. ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, సౌత్ రూరల్ సీఐ ఎన్ సురేష్‌కుమార్, ఎస్‌ఐ సుస్మిత, యువకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం

సాక్షి నెట్‌వర్క్: జాతిపిత, స్వాతంత్ర్య సమరయోధుడు మహాత్మా గాంధీజీ మార్గం అనుసరణీయమని, ఆయన వల్లే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని వక్తలు అన్నారు. గురువారం జిల్లా వ్యాప్తంగా గాంధీ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. నేటి యువత గాంధీ అడుగు జాడల్లో పయనించాలన్నారు. శాంతి, అహింస అనే ఆయుధాలతో స్వాతంత్ర్యం సాధించిన మహనీయుడని గుర్తు చేశారు.



ఎల్లారెడ్డిలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ మేనేజర్ వాసంతి



మొగాలో ..మద్నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేశ్ పటేల్



లింగంపేట మండల కేంద్రంలో.. వివిధ పార్టీల నేతలు



బీబీపేటలో ..



పిట్లంలో ..



తాడ్వాయి మండలం సంగోజీవాడిలో..



సరంపల్లిలో..



దోమకొండలో..